ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

కుప్పం ప్రాంతంలో భారీ వర్షం



రామకుప్పంలో వర్షంతో ఇండ్ల మధ్య చేరిన వర్షపునీరు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావ ద్రోణి కారణంగా గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా కుప్పం నియోజకవర్గ పరిసరాల్లోని ఐదు మండలాల్లో భారీవర్షాలు కురిసాయి. మండలాలవారీగా కుప్పంలో 93, రామకుప్పంలో 38.6, గుడుపల్లిలో 38, వి.కోటలో 28.4, శాంతిపురంలో 24.4 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

మూడు నెలలకోసారి విద్యార్థులకు అనీమియా పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదివే విద్యార్థినీ విద్యార్థులకు ప్రతి మూడు నెలలకోసారి అనీమియా వైద్యపరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో విద్యార్థుల డ్రాపౌట్, అనీమియా వైద్యపరీక్షలు, పౌష్టికాహార పంపిణీ తదితర అంశాలపై సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డితో కలిసి ఎంఈవోలు, హెచ్ఎంలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అనీమియా వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్యపరిస్థితిని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పేర్కొన్న విధంగా మెనూ అమలుపరచాలన్నారు. 2025 జూలై నాటికి 4202 మంది విద్యార్థులను డ్రాపౌట్‌లుగా గుర్తించగా, వారిలో ఇప్పటివరకు 1997 మందిని తిరిగి పాఠశాలలో చేర్పించినట్లు ఆయన తెలిపారు. ఇంకా పాఠశాలల్లో చేరని డ్రాపౌట్ విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వారిని కూడా పాఠశాలలకు రప్పించే ఏర్పాట్లుచేయాలన్నారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి జీపీగా వీఆర్ రామకృష్ణ



కలెక్టర్‌తో రామకృష్ణ

పూతలపట్టు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న వీఆర్ రామకృష్ణను ఇన్‌చార్జి స్పెషల్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ప్రభుత్వం నియమించింది. అలాగే 8వ కోర్టు అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వున్న జ్యోతిరామ్‌ను పలమనేరు, కుప్పం కోర్టులకు, 9వ కోర్టు ఏపీపీగా వున్న శరవణ కుమార్‌ను పుంగనూరు సివిల్ కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

హలో.. ఐయామ్ రోడ్ డాక్టర్



తిరుపతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలంటే ఇకపై మనుషులతో పనిలేదు. 'రోడ్ డాక్టర్' పేరిట తిరుపతి నగరపాలక సంస్థకు వచ్చిన ఓ వాహన యంత్రం నిమిషాల్లో గుంతలను పూడ్చేస్తోంది. బుధవారం నగరంలోని పలు రోడ్లపై ఏర్పడిన గుంతలను ఈ యంత్రం సాయంతో పూడ్చారు. ఈ యంత్రం పనితీరును కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. దీనిని సుమారు రూ1.5 కోట్లతో కొన్నామన్నారు. నూతన టెక్నాలజీతో సిద్ధం చేసిన రోడ్ల డాక్టర్ యంత్రం ద్వారా ఎప్పటికప్పుడు గుంతలను పూడ్చేందుకు అవకాశం ఉందన్నారు. సీసీ రోడ్లు, తారు రోడ్లు పూడ్చేందుకు దీనిని వినియోగిస్తారన్నారు.








స్వర్ణరథంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి - చంద్రప్రభ వాహన సేవకు హాజరైన భక్తజనం - చంద్రపభ వాహనంలో విఘ్నేశ్వరుడు

చంద్రప్రభలో అభయప్రదాత

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో బుధవారం రాత్రి వినాయకస్వామి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.కాణిపాకం, చినకాంపల్లె, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, తిరువణంపల్లె, బొమ్మసముద్రం, అగరంపల్లె, పుణ్యసముద్రం, ఎగువ,దిగువమారేడుపల్లెలు, సంతపల్లె, ఉత్తరబ్రాహ్మణపల్లె, కారకాంపల్లె గ్రామాలకు చెందిన హరిజనులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో కాణిపాకంలో కలశ ఊరేగింపును ఘనంగా నిర్వహించాక మూల విగ్రహానికి అభిషేకాన్ని నిర్వహించారు. దేవదాయ శాఖ విశ్రాంత ఏడీసీ జి.కేశవులు కుటుంబ సభ్యులతో కలసి వరసిద్ధునికి బుధవారం పట్టువస్త్రాలను సమర్పించారు. రాత్రి స్వామికి ఉభయవరస రావడంతో కల్యాణ వేదిక వద్ద స్వామి ఉత్సవ విగ్రహాలకు ఘనంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుని ఉత్సవ విగ్రహాలను చంద్రప్రభ వాహనంపై ఉంచి కాణిపాక పురవీధుల్లో భాజాభజంత్రీల నడుమ ఊరేగించారు.కాగా కాణిపాకంలో బుధవారం ఉదయం సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో పెంచలకిషోర్, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు,బాలాజీనాయుడు,ఉభయదారులు పాల్గొన్నారు.గురువారం వరసిద్ధునికి కల్పవృక్ష వాహన సేవను నిర్వహించనున్నారు.

'పింక్ డైమండ్' కథ కంచికి

- మైసూర్ మహారాజు సమర్పించిన హారంలో వున్నది రూబీ మాత్రమే
- సాక్ష్యాలతో నిరూపించిన ఆర్కియాలజిస్టు మునిరత్నం రెడ్డి



మైసూరు మహారాజు హారంపై వివాదం నేపథ్యంలో రూబీ అంటూ టీటీడీ విడుదల చేసిన ఫొటో



ఆభరణాలను మాజీ న్యాయమూర్తులు తనిఖీ చేస్తున్న సమయంలో తీసిన మైసూరు మహారాజు సమర్పించిన హారం ఫొటో

తిరుమల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పింక్ డైమండ్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. మైసూరు మహారాజు శ్రీవారికి సమర్పించిన హారంలో డైమండ్ లేదని, రూబీలు, కొన్ని రత్నాలు మాత్రమే అమర్చినట్టు కొన్ని సాక్ష్యాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో రాజకీయ విమర్శలతో పింక్ డైమండ్ వ్యవహారం పెద్దఎత్తున చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ప్రభుత్వాన్ని, టీటీడీని ఇబ్బందుల్లోకి నెట్టేలా అప్పట్లో వైసీపీ చేసిన ప్రచారం అసత్యమని తేల్చిచెప్పేలా కొన్ని ఆధారాలను ఆర్కియాలజీ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి బయటపెట్టారు.

1945లో హారం బహూకరించిన మైసూరు మహారాజు

శ్రీవారికి విలువైన ఆభరణాలు బహూకరించిన రాజుల్లో మైసూరు మహారాజు జయచామరాజేంద్ర వడియార్ కూడా ఒకరు. 1945 జనవరి 9వ తేదీన ఆయన శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. మహారాజ పర్యటనకు సంబంధించి మైసూరు ప్యాలెస్ నుంచి 1944 డిసెంబరు 29వ తేదీన రామయ్య అనే ప్యాలెస్ అధికారి టీటీడీ కమిషనర్‌కు లేఖ రాశారు. రైలు ద్వారా 1945 జనవరి 9న ఉదయం 8 గంటలకు రేణిగుంటకు చేరుకునే మహారాజు తిరుపతి, శ్రీకాళహస్తి రాకపోకలకు రెండు మంచి కార్లను ఏర్పాటు చేసేందుకు సహకరించాలంటూ ఆ లేఖలో కోరారు. ఈ సందర్భంలోనే టూర్ షెడ్యూల్ కాపీని కూడా పంపారు.ఈ పర్యటనలోనే మైసూరు మహారాజు శ్రీవారికి హారాన్ని సమర్పించారు.ఆ హారాన్ని టీటీడీ కొన్నేళ్లుగా విశేష ఉత్సవాల సమయంలో ఉత్సవమూర్తులకు అలంకరిస్తోంది.2001 అక్టోబరు 21న జరిగిన గరుడసేవలో మలయప్పస్వామికి ఈ హారాన్ని అలంకరించారు. అయితే వాహనసేవను వీక్షిస్తున్న భక్తులు విసిరిన నాణేలు తగలడంతో ఆ ఆభరణంలో కెంపు రాయి విరిగిపోయింది. ఆ విషయాన్ని తిరువాభరణం రిజిస్టర్‌లో కూడా నమోదు చేశారు.

జెనీవాలో వేలం వేశారన్న రమణదీక్షితులు

మైసూరు మహారాజు శ్రీవారికి సమర్పించిన హారంలో ఉన్నది కెంపు రాయి కాదని, కోట్ల విలువైన పింక్ డైమండ్ అని, ఆ డైమండ్‌ను అపహరించి జెనీవాలో జరిగిన వేలంలో విక్రయించారంటూ 2018లో తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు రమణదీక్షితులు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అలాగే కైంకర్యాలు సరిగా జరగడం లేదని, నిధుల కోసం ఆలయంలో తవ్వకాలు నిర్వహించారని కూడా ఆయన ఆరోపణలు చేయగా టీటీడీ కూడా అదేస్థాయిలో స్పందించింది. రమణదీక్షితులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, ఈ విషయంపై జగన్నాధరావు కమిటీ ఇచ్చిన నివేదికలో పగిలిన కెంపు ముక్కలు పేష్కార్ ఆధీనంలో ఉన్నాయని తెలియజేసినట్టు వివరణ ఇచ్చింది.ఆ కెంపు విలువ రూ.50గా నిర్ధారించినట్టు రికార్డులున్నాయంటూ రమణదీక్షితుల ఆరోపణలను కొట్టిపడేసింది. అయితే స్వామికి అనేక ఏళ్ల దగ్గరుండి కైంకర్యాలు నిర్వహించిన రమణదీక్షితులు చెప్పడంతో పలువురు భక్తులు సందేహంలో పడ్డారు.

గతంలోనూ మాజీ న్యాయమూర్తుల తనిఖీలు

శ్రీవారి ఆభరణాల భద్రతపై గతంలో కూడా విమర్శలు వచ్చాయి. రాయల వారిచ్చిన ఆభరణాలతో పాటు మరికొన్ని ఆభరణాలు మాయమయ్యాయంటూ ఆరోపణలు రావడంతో 2009 సెప్టెంబరు నెలలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జగన్నాధరావు నేతృత్వంలో ఓ కమిటీ, 2010లో జస్టిస్ వాద్వా నేతృత్వంలో మరో కమిటీని ఏర్పాటు చేశారు.టీటీడీ విజిలెన్స్ విభాగం ఇచ్చిన నివేదికతో పాటు అధికారుల వద్ద నున్న తిరువాభరణాల రిజిస్టర్‌ను వాద్వా కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి ఆభరణాలు సక్రమంగానే ఉన్నాయంటూ సంతృప్తి వ్యక్తం చేసింది. జగన్నాథరావు కమిటీ కూడా 1952 నుంచి ఉన్న రికార్డుల ప్రకారం ఏ ఆభరణం మిస్ కాలేదని నివేదికలో పేర్కొంది. కాగా ఆభరణాల భద్రత, వివరాలను పొందుపరచడంలో ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించింది. శ్రీకృష్ణదేవరాయలు సమర్పించిన కానుకల వివరాలు టీటీడీకి అప్పజెప్పినప్పటికీ తిరువాభరణాల లిస్ట్‌లో లేవని తేల్చిచెప్పారు.2001బ్రహోత్సవాల్లో పగిలింది కెంపు మాత్రమేనని, భక్తులు నాణేలు విసిరినప్పుడు అది విరిగిందని రమణదీక్షితులే గుర్తించినట్టు ఆ నివేదికలో ఉంది.కెంపు స్థానంలో వెంటనే ఓ పగడం కూడా తిరిగి అమర్చినట్టు కమిటీ వివరించింది.

రూ.200 కోట్లకు పరువునష్టం దావా

భక్తుల మనోభావాలను దెబ్బతీయడంతో పాటు టీటీడీ ప్రతిష్టను దిగజార్చేలా వ్యాఖ్యలు చేసిన రమణ దీక్షితులు, వైసీపీ అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డిపై రూ.200 కోట్ల పరువు నష్టం దావాను టీటీడీ వేసింది. దీనికి రూ.2 కోట్లు ఫీజు కూడా అప్పటి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం చెల్లించింది.వైసీపీ అధికారం లోకి వచ్చాక ఆ కేసును ఉపసంహరించుకోవడంతో కోర్టుకు చెల్లించిన రూ.2 కోట్ల ఫీజు ఎవరిస్తారని, స్వామి నిధులు ఇలా దుబారా చేస్తారా అంటూ భారీగా విమర్శలొచ్చాయి. అయితే అంతకుముందు నానాయాగీ చేసి, భక్తుల్లో అనేక సందేహాలు రేకెత్తించిన వారంతా సమాధానమివ్వకుండా తేలుకుట్టిన దొంగల్లా మౌనంగా ఉండిపోయారు.



వెలుగులోకి డైమండ్ కాదని సాక్ష్యాధారాలు

మైసూరు మహారాజు సమర్పించిన హారంలో పింక్ డైమండ్ అనేది లేదని పలు సాక్ష్యాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి.మైసూరులోని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్(ఎపిగ్రఫీ) మునిరత్నం రెడ్డి ఈ అంశంపై కొద్దిరోజుల పాటు పరిశోధన చేశారు. మైసూరు మహారాణి ప్రమోద దేవిని కలవడంతో పాటు ప్యాలెస్‌లోని కొన్ని రికార్డులను పరిశీలించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో ఆ హారాన్ని రూ.8,500కు ఢిల్లీలో తయారు చేయించినట్టు తేలింది. ప్యాలెస్‌లోని ఆభరణాల రికార్డుల్లోనూ శ్రీవారికి సమర్పించిన హారంలో ఎలాంటి డైమండ్ ఉన్నట్టు లేదు. దీంతో గతంలో చేసిన విమర్శలు తాజా ఆధారాలతో అవాస్తవాలుగా తేలాయి. ఈ అంశంపై మునిరత్నం రెడ్డి మాట్లాడుతూ.. 'స్వామివారి విషయాల్లో లేనిపోని అభాండాలు వేయకూడదు. తప్పుడు ప్రచారాలు చేస్తే మూల్యం చెల్లించాల్సిందే. మా పరిశోధనలో రాజు సమర్పించిన హారంలో డైమండ్ లేదని తేలింది. దేవాలయాల విషయాల్లో రాజకీయాలు చేయడం సరి కాదు' అని అభిప్రాయపడ్డారు.



ఆర్థిక ఇబ్బందులతో
కుటుంబం ఆత్మహత్యాయత్నం

- ఇద్దరి మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం



కేఆర్‌బీ డ్యాం



కృష్ణగిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతి, కీర్తిక - రిజర్వాయర్ నుంచి ఈతగాళ్లు వెలికి తీస్తున్న లక్ష్మణమూర్తి, శారదమ్మాళ్ మృతదేహాలు

కుప్పం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి):కుప్పం పట్టణానికి చెందిన ఓ కుటుంబం తమిళనాడు రాష్ట్రంలో జిల్లా కేంద్రమైన కృష్ణగిరి సమీపంలో వున్న కేఆర్‌బీ డ్యాంలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు నలుగురిలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం మేరకు ..... లక్ష్మణమూర్తి (50) కుటుంబం కుప్పం పట్టణం కొత్తపేట జయప్రకాశ్ రోడ్డులో నివాసముంటోంది. టీ బంకుతో జీవనం సాగిస్తున్న ఈ కుటుంబంలో లక్ష్మణమూర్తి అత్త శారదమ్మాళ్ (75), భార్య జ్యోతి (45), కుమార్తె కీర్తిక (20) సభ్యులుగా ఉన్నారు. నలుగురు సభ్యులతో కూడిన ఈ కుటుంబం బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి ఎవరికీ చెప్పకుండా కృష్ణగిరి వెళ్లింది. కేఆర్‌బీ డ్యాంలో చిన్న స్లూయిస్ గేటు వద్దకు వచ్చిన వీరంతా హఠాత్తుగా డ్యాంలోకి దూకారు.డ్యాం దిగువభాగంలో చేపలు పట్టుకుంటున్న జాలరులు గమనించి వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. అయితే ఇద్దరు మహిళల్ని మాత్రమే రక్షించగలిగారు.లక్ష్మణమూర్తి కుటుంబం మొత్తం రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యాయత్నం చేసిందన్న సమాచారం అక్కడి పోలీసుల ద్వారా కుప్పంలో ఉన్న వారి బంధువులకు అందింది. ఈ దుర్ఘటనలో లక్ష్మణమూర్తితోపాటు ఆయన అత్త శారదమ్మాళ్ మృతి చెందారు. ఆయన భార్య జ్యోతి, కుమార్తె కీర్తికలను మత్స్యకారులు గమనించి బయటకు తీసుకు వచ్చారు. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని చికిత్స నిమిత్తం స్థానిక పోలీసులు కృష్ణగిరి ఆసుపత్రిలో చేర్చారు. సమాచారం అందుకున్న కృష్ణగిరి డ్యాం పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను వెలికి తీసి, పోస్టుమార్టం కోసం కృష్ణగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో లక్ష్మణమూర్తి కుటుంబం ఆత్మహత్యాయత్నం చేసినట్లు చెబుతున్నారు.ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో బంధువర్గంతోపాటు కొత్తపేట మొత్తం శోకసంద్రమైంది. కృష్ణగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





శ్రీవారి సేవకు రెండోసారి సింఘాల్

తిరుమల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామి సేవకు రెండోసారి టీటీడీ ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ బాధ్యతలు స్వీకరించారు. టీటీడీ ఈవోగా, బోర్డు మెంబర్ సెక్రటరీ ఎక్స్ అఫిషియోగా బుధవారం ఉదయం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రెండోసారి ఈవోగా రావడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. 2017 మే నుంచి 2020 అక్టోబరు వరకు మూడేళ్ల నాలుగు నెలలు సేవలు అందించానని చెప్పారు. 1994 నుంచి శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వస్తున్నానని చెప్పారు. ఈవోగా కాకుండా సామాన్య భక్తుడిగా క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్న సందర్భాలున్నాయన్నారు. బ్రహ్మోత్సవాల్లోని గరుడసేవను కూడా సామాన్యుడిగా దర్శించానని, తనకు సామాన్య భక్తుల ఇబ్బందులు తెలుసన్నారు. దేవాలయ పవిత్రతను కాపాడేందుకు, సాధారణ భక్తులకు న్యాయం చేసేందుకు టెక్నాలజీపై దృష్టి పెడతామన్నారు. టీటీడీ అధికారులు ఎంతో చిత్తశుద్ధితో రాత్రింబవళ్లు కృషి చేసి ఉత్సవాలను విజయవంతం చేస్తున్నారన్నారు. శ్రీవారి సేవకుల సేవలు మరింత విస్తరించే దిశగా ఆలోచనలు చేస్తున్నామన్నారు. భక్తుల సూచనలు స్వీకరించి టీటీడీ సేవలు మెరుగుపరుస్తామన్నారు.

కాలినడక, తలనీలాల సమర్పణ

ఈవోగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు అనిల్‌కుమార్ సింఘాల్ బుధవారం ఉదయం 5.05 గంటలకు అలిపిరి మార్గంలో కాలినడకను ప్రారంభించి 8 గంటలకు చేరుకున్నారు. మార్గమధ్యలో కొందరి భక్తులతో మాట్లాడారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలు తెలుసుకోవడంతో పాటు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. ఎలాంటి విషయాల్లో చర్యలు తీసుకోవాలనే ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అనంతరం తిరుమలలో తలనీలాలు సమర్పించి ఆలయంలోకి వెళ్లారు.


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.07 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,828

తలనీలాలు సమర్పించినవారు: 26,296



ఇక డీలర్ల వద్ద నో వెయిటింగ్

- ఇప్పటికే ప్రజలకు స్మార్టు కార్డుల పంపిణీ
- డీలర్లకు ఈ-పోస్ మిషన్ల అందజేతకు ఏర్పాట్లు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో అవినీతి అక్రమాలకు చెక్ పెట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ఇప్పటికే తొలి విడతలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేసిన అధికారులు తాజాగా ఆధునిక ఈ-పోస్ పరికరాలను అందజేయాలని నిర్ణయించింది. పాత మిషన్లలో రేషన్ కార్డు నంబరు నమోదు చేశాక కార్డుదారుని వేలి ముద్ర తీసుకునేవారు. దీనివల్ల పని ఆలస్యమయ్యేది. కార్డుదారులు ఇబ్బందిపడేవారు. ఇప్పుడు స్మార్ట్ కార్డుల్లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా,స్వైపింగ్ చేసినా డీలర్ల పని సులభమవుతోంది. వెంటనే కార్డులోని కుటుంబ సభ్యుల వివరాలు కనిపిస్తున్నాయి. ఈ-పోస్ పరికరం కూడా మొబైల్ ఫోన్‌లా పనిచేస్తుంది. ఇందులో సిమ్ కార్డు పెట్టి రీచార్జి చేస్తారు. తక్కువ బరువు ఉండడం వల్ల ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చునని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు ఆంధ్రజ్యోతికి చెప్పారు. అంగన్ వాడీ కేంద్రాలకు అందచేస్తున్న సరకుల వివరాలు, డీలర్ల వద్ద నిల్వలు తదితర వివరాలు క్షణాల్లో తెలుసుకోవచ్చన్నారు.

అక్టోబరు రెండు నుంచి పూర్తి స్థాయిలో..

అక్టోబరు రెండు నుంచి పూర్తి స్థాయిలో రేషన్ దుకాణాల డీలర్లకు ఈ-పోస్ పరికరాలను పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం జిల్లాకు దాదాపు 1457 మిషన్లు వచ్చాయి. వీటిని డీలర్లకు అందచేసి వచ్చే నెల మొదటి వారం నుంచి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వంద మంది డీలర్లకు వీటిని అందచేశారు. సర్వర్, పరికరాల ద్వారా సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు జాగ్రత్తలు పడుతున్నారు.



యువకుడి దారుణహత్య



రహీద్‌బాషా(ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం ఓ యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న రహీద్‌బాషా అలియాస్ మున్నా(35) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం స్థానిక గాంధీనగర్ సమీపంలోని శ్మశానం వద్ద రహీద్ బాషా రక్తపు మడుగులో పడి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ గీతాకుమారి సీఐలు శ్రీనివాస్, శేఖర్ బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రంపించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట రహీద్‌బాషా బంధువులు ఆందోళన చేపట్టారు. హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మృతుడి బంధువులకు, పోలీసులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు నచ్చచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

మహిళా సాధికారత సదస్సు ఏర్పాట్ల పరిశీలన

తిరుపతి, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 14, 15న జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సుకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. హోటల్ తాజ్, గ్రాండ్ రిడ్జ్, హోటల్ సరోవర్‌లో అతిథుల బస కు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. సదస్సు నోడల్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం అధికారులతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపల్, తుడా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆమె సూచించారు. జిల్లా పంచాయితీ అధికారి వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, తుడా ఈ.ఈ రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్‌లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతు మాధవ్, రవి, మేనేజర్ హాసీమ్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి ఉన్నారు.

రేపు టూరిజం ఇన్వెస్టర్స్ మీట్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని తాజ్ హోటల్‌లో శుక్రవారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ టూరిజం ఇన్వెస్టర్స్ మీట్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ ఆధ్వర్యంలో జరిగే ఈ మీట్‌లో రాష్ట్రంలో పర్యాటక రంగం బలోపేతం, ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా చర్చలు జరుపుతారని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించే రోడ్ మ్యాప్ రూపొందించనున్నట్లు తెలిపారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు, అనంతపురం, సత్యసాయి, కర్నూలు జిల్లాల నుంచి స్టేక్ హోల్డర్స్ పాల్గొంటారని వెల్లడించారు.

వందశాతం లక్ష్యసాధనకు కృషి చేయాలి



కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వందశాతం లక్ష్యసాధనకు వైద్యాధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో తక్కువ ప్రగతి సాధించిన కేంద్రాల వైద్యాధికారుల నుంచి కారణాలు తెలుసుకుని అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. జననాల సంఖ్య పెంపు, టీకాలు పూర్తిచేయడం, మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధన జరిగేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, వైద్యాధికారులు శైలజ, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, శాంతకుమారి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌లో పాల్గొనడం గొప్ప అవకాశం

- పద్మావతి వర్సిటీలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్ -



విజేతలతో వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్‌లో పాల్గొనడం విద్యార్థులకు మంచి అవకాశమని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీలో బుధవారం చేపట్టిన అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవాలని కోరారు. క్వాంటం కంప్యూటింగ్‌కు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు ఉన్నాయన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పరిశ్రమలు-విద్యాసంస్థల భాగస్వామ్యంతో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సందర్భంగా సాంకేతికత ఆధారంగా సామాజిక సమస్యల పరిష్కారంపై చేపట్టిన పోటీల్లో విజేతలకు కలెక్టర్ వెంకటేశ్వర్, వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, డీన్ వాణి, ఉన్నత విద్యామండలి ప్రతినిధి రోశయ్య, టీబీఐ సీఈవో సూర్యకుమార్ నగదు బహుమతులు అందజేశారు.

చెరువుల అభివృద్ధికి శ్రీకారం

- **మరమ్మతులకు రూ.515 కోట్లతో ప్రతిపాదనలు**



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 181 చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ, పునర్నిర్మాణం కోసం రూ.515.18 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం చెరువుల పునరుద్ధరణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 181 చెరువులను బాగుచేయడం ద్వారా 30,08,185 హెక్టార్ల ఆయకట్టుకు ప్రయోజనం లభించనుందని తెలిపారు. 33 కరువు ప్రభావిత మండలాలు లబ్ధి పొందనున్నాయన్నారు. స్లూయిజ్‌లు, సరఫరా చానల్స్ మరమ్మతులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు రాధాకృష్ణ, వెంకటేశ్వరరావు, దేశీనాయక్, వెంకటేశ్వరప్రసాద్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు.

మద్యం తాగి విధులకు వాచ్‌మెన్లు

- కొందరు విద్యార్థులతోనూ తాగించిన వైనం?
- బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో కలకలం

తిరుపతిరూరల్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): తామే కాకుండా కొందరు విద్యార్థులతోనూ ఇద్దరు వాచ్‌మెన్లు మద్యం తాగించిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థుల తల్లిదండ్రుల తెలిపిన వివరాలిలా.. తాటితోపు వద్ద జ్యోతిబా పులే బీసీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ఉంది. 5-10తరగతులకు చెందిన 230మంది ఇందులో చదువుతున్నారు. ఇక్కడి ఇద్దరు వాచ్‌మెన్లు సాయంత్రం పూట మద్యం తాగి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల దీనిని కొందరు విద్యార్థులు గమనించారు. దీంతో ప్రిన్సిపాల్, టీచర్లకు ఫిర్యాదు చేయవద్దంటూ బెదిరించి వారితోనూ మద్యం మద్యం తాగించారని సమాచారం. విద్యార్థులు తర్వాత ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. వాచ్‌మెన్ల వ్యవహార శైలిపై గతంలోనూ చేసినా ప్రిన్సిపాల్, టీచర్లు పట్టిపట్టనట్టు వ్యవహరించారని తల్లిదండ్రులు ఆరోపించారు. కాగా వాచ్‌మెన్లను ప్రిన్సిపాల్ పిలిచి మందలించి మొదటి తప్పుగా వదిలేశారని సమాచారం. ప్రిన్సిపాల్ గిరిధర్‌ని వివరణ కోరగా..పాఠశాలలో మద్యం బాటిళ్లు ఉంటే బయటపడేసి వాచ్‌మెన్లను మందలించామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. విచారణ జరుగుతుందని వివరించారు.

నేడు కేంద్ర ఆర్థిక మంత్రి రాక

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మూడు రోజుల పర్యటన నిమిత్తం గురువారం తిరుపతికి రానున్నారు. మధ్యాహ్నం 2గంటలకు హైదరాబాద్ నుంచి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడ బస చేసి, శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు.శనివారం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

ఆహార భద్రతపై పారిశ్రామికవేత్తలకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

మంగళం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతపై బుధవారం తిరుపతిలోని టీటీడీసీ సమావేశ మందిరంలో పారిశ్రామికవేత్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆహార పదార్థాలు తయారు చేయడంలో ఉపయోగించాల్సిన ముడి పదార్థాలను గుర్తించడం, వాటిని ఉపయోగించడంపై చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు చెందిన 120మంది మహిళా పారిశ్రామికవేత్తలు శిక్షణ పొంది సర్టిఫికెట్లు అందుకున్నారు. కుప్పం నుంచి అత్యధికంగా 20మంది మహిళా పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు మాట్లాడుతూ ఆహార ఆధారిత పరిశ్రమలకు మిల్లెట్స్ ఫుడ్ ప్రాముఖ్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యారిస్ హౌస్ ట్రస్టు సభ్యురాలు శిరీష, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

13న బాక్సింగ్ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని జీడ్పీ హైస్కూల్లో ఈ నెల 13న జిల్లాస్థాయి అండర్ 14 బాలురు, అండర్ 17, 19 బాలికల బాక్సింగ్, బైరాగిపట్టెడ ప్రైవేటు క్రీడా ప్రాంగణంలో లాన్‌టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్న వారు అర్హులని, ఆసక్తిగల బాలబాలికలు సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని పేర్కొన్నారు. హెచ్‌ఎం నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ విద్యార్థులు పదవ తరగతి ఒరిజినల్ మార్కులిస్టుతో రావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 9849159147, 9441891874 (బాక్సింగ్), 9700778867 (లాన్‌టెన్నిస్)లను సంప్రదించాలని కోరారు.



సాధు సుబ్రహ్మణ్యశాస్త్రికి ఘన నివాళులు



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శాసనాల ద్వారా వెంకటేశ్వర స్వామి వైభవాన్ని విశ్వవ్యాప్తం కావడానికి కృషి చేసిన మహనీయుడు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి అని ప్రముఖ శాసన పరిశోధకుడు సౌరకాయల కృష్ణారెడ్డి అన్నారు. అన్నమాచార్య కళామందిరంలో బుధవారం జరిగిన సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రీవారి ఆలయ పేష్కారుగా ఉంటూ 1167 రాగిరేకుల శాసనాలను ఆయన సేకరించి అనువదించారన్నారు. అన్నమయ్య కీర్తనల భాండాగారం నుంచి చాలా రాగి రేకులను వెలికితీసినట్లు చెప్పారు. దేవస్థానం ఉద్యోగిగా మాత్రమే కాకుండా పురాతన వస్తు పరిశోధనా శాస్త్రవేత్తగా స్వామివారి వైభవాన్ని తొలిసారి ఎలుగెత్తిచాటిన ఘనత శాస్త్రికి దక్కిందన్నారు. సంస్కృత విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయులు శ్రీవారికి అందించిన అనేక విలువైన అభరాలను శాసనాల ద్వారా శాస్త్రీ ప్రపంచానికి తెలియజేశారన్నారు. పంచసహస్ర అవధాని మేడసాని మోహన్ కూడా మాట్లాడారు. అంతకు ముందు సుబ్రహ్మణ్యశాస్త్రి విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. అలాగే ఎస్వీ ఓరియంటల్ కళాశాలలో గౌరిపెద్ది రామసుబ్బ శర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. శర్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న కార్తీక్ సాయి

ప్రకృతి ప్రయోజనకారులు పక్షులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణుల సహజ ఆవాసాలను నాశనం చేయకుండా చూడటం కనీస ధర్మమని వన్య ప్రాణి పరిశోధకులు కార్తీక్ సాయి పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎక్కువ పక్షులు ప్రకృతికి మేలు చేస్తాయన్నారు. వీటిని గుర్తించడం, కాపాడటం, వివరాలను తెలుసుకోవడం లాంటివి చేయాలన్నారు. ఇందుకు ప్రకృతి ప్రేమికులు చొరవ చూపాలన్నారు. పక్షులకు సంబంధించిన వివరాలు భద్రపరచడానికి తాను ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




సంకటహర గణపతి వ్రతంలో పాల్గొన్న భక్తులు - క్షీరాభిషేకంలో ఉభయదారులు, భక్తులు

వైభవంగా సంకటహర గణపతి వ్రతం

● స్వర్ణరథంపై మాడ వీధుల్లో ఊరేగిన వరసిద్ధుడు



ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో బుధవారం సంకటహర గణపతి వ్రతాన్ని ఆలయ అధికారులు భక్తుల చేత వైభవంగా నిర్వహింపజేశారు. ఉదయం మూల విరాట్‌కు వైభవంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. తర్వాత ఉత్సవ విగ్రహాల ఎదుట భక్తులను కూర్చోబెట్టి సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. ఈ వ్రతాన్ని ఆచరిస్తే సర్వకష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అనంతరం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కోసమే మారథాన్




మారథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న చుడా చైర్‌పర్సన్ హేమలత - 5కే రన్ పోటీలో గెలుపొందిన విద్యార్థులు, ట్రాన్స్‌జెండర్లు

చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం కోసమే మారథాన్ కార్యక్రమం నిర్వహించినట్లు చుడా చైర్‌పర్సన్ హేమలత అన్నారు. బుధవారం చిత్తూరులో మెసానికల్ మైదానం నుంచి 5కే మారథాన్ కార్యక్రమాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ15-49 సంవత్సరాల స్త్రీలలో 21.6 శాతం, పురుషుల్లో 30.7 శాతం మందికి హెచ్‌ఐవీపై అవగాహన లేదన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మూడువేల మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు.ప్రతి గర్భిణీకి తప్పకుండా హెచ్‌ఐవీ టెస్టులు చేసి, పాజిటివ్ వచ్చిన వారికి మందులు అందించి పుట్టబోయే బిడ్డకు ఎయిడ్స్ సోకకుండా నివారిస్తున్నామని తెలిపారు. అనంతరం మెసానికల్ మైదానం నుంచి పీవీకేఎన్ వరకు 5కే మారథాన్‌ను నిర్వహించారు.విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండవ బహుమతిగా రూ.7 వేలు సీఐలు నిత్యబాబు, మహేష్ ప్రదానం చేశారు. డీఎస్‌డీవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

● విజేతలు వీరే...

పురుషుల విభాగంలో... విజయం కళాశాలలో బీకాం ఫస్ట్ ఇయర్ చదువుతున్న వినోద్‌కుమార్ మొదటి బహుమతిని గెలుపొందగా, రెండో బహుమతిని పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న హుస్సేన్ బాష గెలుపొందాడు. మహిళల విభాగంలో... కృష్ణవేణి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న దివ్య మొదటి బహుమతిని, శ్రీవివేకానంద జూనియన్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న కీర్తన రెండో బహుమతి గెలుపొందింది.

ట్రాన్స్‌జెండర్ విభాగంలో... నగరానికి చెందిన వినోద్‌కుమార్(స్వప్న) మొదటి బహుమతిని గెలుపొందగా, ప్రియశ్రీ రెండో బహుమతిని గెలుపొందారు. వీరు ఈ నెల 12వ తేదీన విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారన్నారని అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తెలిపారు.

వరసిద్ధుడి సేవలో ఆలయ పునర్నిర్మాణ దాత



ఐరాల (కాణిపాకం), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పునర్నిర్మాణ దాత, బంగారు, వెండి వాకిలి దాత గుత్తి కొండ శ్రీనివాస్ దంపతులు బుధవారం సాయంత్రం స్వామిని దర్శించుకున్నారు. వారిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారిని అలంకార మండపం ఎదుట వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌ను ఉపయోగించుకోండి



ఫిర్యాదులను పరిశీలిస్తున్న రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కారానికిగాను డబ్బులు ఖర్చులేకుండా నిర్వహించే ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. గంగాధరనెల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణంలో బుధవారం రిటైర్డ్ జడ్జితో పాటు ఆర్థిక, సాంకేతిక సభ్యులు మధుకుమార్, స్వతంత్ర్య సభ్యులు విజయలక్ష్మి, జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈ సురేష్‌కుమార్ సమక్షంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస అంజనేయమూర్తి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 120 చోట్ల ప్రత్యేక విద్యుత్ అదాలత్ సమావేశాలు నిర్వహించామని తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉండి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఏర్పడినపుడు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గతేడాది ఏప్రియల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు జరిగిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ల్లో 364 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 359 సమస్యలు పరిష్కరించామని, మిగిలిన ఐదు సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ ఏడాది ఏప్రియల్ నుంచి ఇప్పటివరకు జరిగిన అదాలత్‌ల్లో 288 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 175 పరిష్కరించమని, ఇంకా 113 పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈలు శేషాద్రిరెడ్డి, చంద్రబాబు, ప్రభాకర్‌రెడ్డి, గంగాధరనెల్లూరు, ఆవలకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏఈలు వరదరాజులు, తంగవేలు, పలువురు ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

లేజర్ రన్ క్రీడాకారులకు సత్కారం



క్రీడాకారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో ఈనెల 4 నుంచి 8వ తేదీవరకు జరిగిన జాతీయస్థాయి లేజర్ రన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరచిన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ తన కార్యాలయంలో బుధవారం సత్కరించారు. స్థానిక బృందావన్ పాఠశాలకు చెందిన డి.సాయిభార్గవ్ భారతదేశం తరపున దక్షిణాఫ్రికాలో ఈ ఏడాది డిసెంబరు 7 నుంచి 12వ తేదీవరకు ఆరురోజుల పాటు జరిగే అంతర్జాతీయ లేజర్ రన్ పోటీలకు ఎంపికైన సందర్భంగా కలెక్టర్ అతడిని ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న పి.నిర్మల, షేక్ హఫీఫా, కె.సౌమ్య, పి.విఘ్నేషలను కలెక్టర్ శాలువాతో సత్కరించి క్రీడా పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరచడం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. మరింత కృషిచేసి క్రీడాకారులు భారతదేశానికి అత్యున్నత గౌరవం తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ సీనియర్ నేత షణ్ముగం పాల్గొన్నారు.

డ్రైవర్‌కు ఫిట్స్ : ఇంట్లోకి దూసుకెళ్లిన ఆటో

● ఐదుగురికి గాయాలు





ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తులు

చౌడేపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో అదుపుతప్పి ఆటో ఇంట్లోకి దూసుకెళ్లడంతో ఐదుగురు గాయపడిన సంఘటన చౌడేపల్లె మండలంలో బుధవారం జరిగింది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు... రాయలపేట పంచాయతీ గౌదమాకులపల్లెకు చెందిన వ్యవసాయ కూలీలు మండలంలోని శెట్టిపేట పంచాయతీ యర్రపల్లెలోని ఓ రైతు పొలంలో టమోటా పంటలో కూలీ పనులకు వచ్చారు. పనులు ముగించుకొని గౌదమాకులపల్లెకు ఆటోలో బయలుదేరారు. దుర్గసముద్రం వద్ద ఆటో డ్రైవరుకు ఫిట్స్ రావడంతో ఆటో అదుపుతప్పి ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఆటో డ్రైవరు విశ్వనాథ్(35), హారతి(24), తేజశ్రీ(26), మంజుల (34), మంజులమ్మ (40) గాయపడ్డారు. వీరిని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

వ్యవసాయ సర్వీసుల జారీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● ఏఈలకు ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సర్వీసుల జారీ విషయంలో ఏఈలు జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారని, వారిపై చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య హెచ్చరించారు. బుధవారం గిరింపేటలోని ఎస్ఈ కార్యాలయంలో చిత్తూరు రూరల్ డివిజన్ అధికారులతో వివిధ సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం మండలాల ఏఈలు వ్యవసాయ సర్వీసులు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వర్క్ ఆర్డర్లు కూడా పూర్తిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందిస్తోందని, 200 యూనిట్లకు పైగా వినియోగించేవారు డబ్బులు చెల్లించేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. డబ్బు లు చెల్లించలేదని మీటర్లు తొలగిస్తే వారు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని, ఇది శాఖకు నష్టం కలగజేస్తుందని వివరించారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లి దీనిపై అవగాహన కల్పించి పెండింగ్ బకాయిలను కట్టించాలని, మీటర్లు బిగించాలని ఆదేశించారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై వినియోగదారులకు అవగాహన కల్పించి ప్రభుత్వం అందిస్తున్న 50 శాతం రాయితీని ఉపయోగించుకునేలా చేయాలని అన్నారు. డబ్బులు చెల్లించినా హెచ్‌టీ, వాణిజ్య సర్వీసులను సకాలంలో ఇవ్వడం లేదని ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్, ట్రిప్పింగ్, ఓవర్‌లోడ్‌పై దృష్టి సారించాలని, వాటిని నివారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు సురేష్, జగదీష్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అసత్య కథనాలు ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానల్‌పై ఫిర్యాదు



సీఐ మహేశ్వరకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేణుల ఆత్మాభిమానం దెబ్బతినేలా... తప్పుడు కథనాలు ప్రసారం చేసిన ఓల్గా టైమ్స్ ఛానల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చిత్తూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు కోరారు. బుధవారం టౌన్ బ్యాంకు ఛైర్మన్ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో నేతలు ఒకటో పట్టణ సీఐ మహేశ్వరను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. చిత్తూరులో చేతులు కలిపిన టీడీపీ, వైసీపీ అనే వీడియో కథనంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా, కల్పిత, అసత్య సమాచారంతో వార్త కథనాన్ని ప్రసారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ పరువుకు నష్టం కలిగించేలా ప్రసారం చేయడంపై ఇన్ఫర్మేషన్ యాక్టు 2000 మేరకు కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఓల్గా టైమ్స్ రిపోర్టర్, ఎడిటర్, తప్పుడు కథనం ప్రచారం చేసిన వారిపైన చర్యలు తీసుకోవాలన్నారు. తప్పుడు కథనాన్ని ప్రసారం చేసిన ఓల్గా టైమ్స్ వారు బేషరతుగా క్షమాణలు చెప్పాలని డిమాండ్‌చేశారు. సీఐని కలిసిన వారిలో టీడీపీ నేతలు వెంకటేష్ యాదవ్, మోహన్‌రాజ్, తిరుకుమరన్, బీజేపీ నేతలు అట్లూరి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

పంటలపై ఆగని గజ దాడులు

పాతపేటను వీడని ఏనుగుల మంద -4 రోజుల్లోనే వందలాది కొబ్బరిచెట్లు ధ్వంసం



పాతపేట వద్ద కొబ్బరిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

కల్లూరు, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పాతపేట వద్ద నాలుగు రోజులుగా ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. కేవలం నాలుగు రోజుల్లోనే వందలాది కొబ్బరిచెట్లు నేలకొరిగాయి. వేరుశనగ, వరి, మామిడిచెట్లకు తీవ్రనష్టం వాటిల్లింది. మంగళవారం రాత్రి పశ్చిమ విభాగంఅటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి బయలుదేరిన 13 ఏనుగుల గుంపు సదుం మండలం గంటావారిపల్లి వద్దకు చేరుకున్నాయి. అక్కడి గ్రామస్థులు అప్రమత్తమై టపాకాయలు పేల్చడంతో వెనుదిరిగిన ఏనుగుల గుంపు చిట్లగుట్ట మీదుగా పాతపాళ్యం అడవి మార్గంలో పాతపేట వద్దకు చేరుకున్నాయి.దొరస్వామి, శ్రీనివాసులు, సుబ్రమణ్యం,సురేష్‌లకు చెందిన కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. జయచంద్ర, మునిరాజకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. గుర్రప్ప, జయచంద్ర, నందగోపాల్, సుబ్రమణ్యంకు చెందిన పశుగ్రాసాన్ని తినేశాయి. మోహన్‌కు చెందిన బోరు మోటర్‌ను కదిలించాయి. అక్కడి నుంచి తిరుగుముఖం పట్టిన ఏనుగులు అడవిలోని పెద్దవంక వద్దకు చేరుకున్నట్లు స్థానిక ప్రజలు తెలిపారు.నాలుగు రోజులుగా పాతపేట వద్ద పంటలపై ఏనుగుల గుంపు వరుస దాడులు చేస్తున్నా నివారించడంలో అటవీశాఖ సిబ్బంది విఫలమవుతున్నారని పాతపేట ప్రజలు మండిపడుతున్నారు. ధ్వంసమవుతున్న పంటలను పరిశీలించడం,ఫొటోలు తీసుకోవడంతోనే పనైపోయినట్లు సిబ్బంది వ్యవహరిస్తున్నారని, పంటలపై ఏనుగుల దాడులను నివారించేందుకు ముందస్తు కార్యాచరణ ఆలోచించడం లేదని విమర్శిస్తున్నారు.

తమిళనాడుకు ఆగని గ్రావెల్ రవాణా




వనదుర్గాపురంలో గ్రావెల్‌ను తరలించేందుకు వెళ్తున్న టిప్పర్లు - క్వారీ నిర్వాహకులతో మాట్లాడుతున్న అధికారులు

పాలసముద్రం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలో కొన్ని నెలలుగా గ్రావెల్ (ఎర్రమట్టి), గ్రానైట్‌ను తమిళనాడుకు వైసీపీ నేతలు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వనదుర్గాపురం అటవీప్రాంతం నుంచి గ్రావెల్‌ను తరలించడానికి నగరికి చెందిన వైసీపీ నేత కె.జె. కుమార్ కుమారుడు మురళి అనుమతులు తీసుకుని తమిళనాడుకు మూడురోజులుగా తరలిస్తున్నారు.ప్రజలు సోమవారం అడ్డుకొని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ అరుణకుమారి, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప రెండు టిప్పర్లను సీజ్‌చేసి, మిగతా వాటిని వదిలేశారు. సీజ్‌చేసిన రెండు టిప్పర్లకు మంగళవారం జిల్లా మైన్స్ అధికారులు తక్కువ మొత్తంలో అపరాధం విధించి రిలీజ్ చేయడంతో వారు బుధవారం యథావిధిగా తమిళనాడుకు రవాణా చేయడానికి టిప్పర్లలో గ్రావెల్ తరలించారు.ప్రజలు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ అరుణకుమారి, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప సంఘటనా స్థలానికి వెళ్లారు.అయితే తమకు గ్రావెల్ తరలించడానికి మైనింగ్‌శాఖ అనుమతి ఇచ్చిందని వారు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమిళనాడులోని తిరువళ్ళూరు నుంచి హైవే రోడ్డు నిర్మించడానికి గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు తెలిపారు.తమిళనాడులో రోడ్డు నిర్మించడానికి పాలసముద్రం నుంచి ఎందుకు ఎర్రమట్టి తరలిస్తారని ఈ సందర్భంగా అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. దీంతో నిర్వాహకులు గ్రావెల్ తరలించడాన్ని నిలిపేశారు. అయితే తహసీల్దార్ మాత్రం మైన్స్‌శాఖ అనుమతి ఇవ్వడం వల్ల వారు ఎక్కడైనా విక్రయించుకోవచ్చని తెలిపారు.ఎస్ఐ మాత్రం గ్రావెల్‌ను ఆంధ్రరాష్ట్రంలో మాత్రమే విక్రయించాలని, తమిళనాడుకు తరలించి విక్రయించడానికి వీల్లేదన్నారు. మూడు రోజులుగా తరలించిన గ్రావెల్‌కు ఒక్క రూపాయి కూడా మైన్స్‌శాఖకు చెల్లించలేదన్నారు. కొన్నేళ్ళుగా వనదుర్గాపురం నుంచి గ్రావెల్‌ను ఇతర రాష్ట్రాలకు తరలించి విక్రయించినా పంచాయతీకి మాత్రం రూపాయి ఆదాయం రాలేదని సర్పంచ్ నరసింహరాజు మండిపడ్డారు. ఈ దందా నడుపుతున్న వైసీపీ నేతలను అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.పైగా బాలకృష్ణాపురం సర్వేయర్ చందు రెండు నెలలుగా సెలవు పెట్టి ఈ గ్రావెల్ మాఫియాకు సహకరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇతడి వ్యవహారశైలిపై బుధవారం జిల్లా అధికారులకు సైతం ప్రజలు ఫిర్యాదుచేశారు. క్వారీ వద్ద తహసీల్దార్, ఎస్ఐ వెళ్ళినప్పుడు అక్కడ వ్యాపారులతో కలిసి చందు వుండడంతో ప్రజలు నిలదీశారు.

లారీ అతివేగానికి యువకుడి బలి



మృతి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి మొగిలిఘాట్‌లో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై ప్రసాద్ కథనం మేరకు... గంగవరం మండలం మామడుగు పంచాయతీ అప్పిశెట్టిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి ఓప్రైవేటు ఫైవ్‌స్టార్ ఫైనాన్స్‌లో పని చేసేవాడు. పని నిమిత్తం బంగారుపాళ్యంకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా, పలమనేరు వైపు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న గూడ్స్ కెరీర్ లారీ అతివేగంగా వచ్చి ఢీకొని దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్‌రెడ్డి (23) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి పద్మ, చెల్లెలు, బంధువుల రోదనలు పలువురిని కంటతడిపెట్టించాయి.

అబ్బురపరిచిన గణిత అవధానం



అవధాన కర్త, గణిత ఉపాధ్యాయులకు సన్మానం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గణిత అవధాని అరుణ శివప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీఎస్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 43వ గణిత అవధానం అబ్బురపరచింది. సంధాన కర్తగా ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు దండాల రాధాకృష్ణ వ్యవహరించారు. ఈనెల 12న కన్నన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన జన్మదిన తేదీపై మ్యాజిక్ స్క్వేర్ చెప్పమనగా, ఎటువంటి కూడికలు లేకుండా 24 విధాలుగా వివరించడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. విద్యార్థులకు సైతం గణితంపై భయాన్ని పోగొట్టడానికి గణిత అవధానం ఎంతో ఉపయోగపడుతుందని పలువురు వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో కన్నన్ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం, అమర్నాథ్‌రెడ్డి, శ్యామలాదేవి, కృష్ణంరాజు, గోపాల్, భూపాల్‌రెడ్డి, మురళి, పార్థసారథి, మునిరత్నం నాయుడు, నరసింహులు, కళాశాల ప్రిన్సిపాల్ మౌల, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకే 'వీవీఎం'



వీవీఎం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కోఆర్డినేటర్, హెచ్‌ఎం తదితరులు

యాదమరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) ప్రతిభ పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కౌశల్ కోఆర్డినేటర్ కె.దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్ష 6వ తరగతి నుంచి 11వ తరగతి చదివే విద్యార్థుల కోసం ఉద్దేశించినదని ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి రూ.24 వేలు నగదు బహుమతితో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కూడా లభిస్తాయని దామోదర్‌రెడ్డి వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం ఏపీ లలిత పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.కనకాచారి, రాష్ట్ర కౌన్సిలర్ భాస్కరరెడ్డి, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మధుసూదన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

I, MANCHURI SUMALATHA (Old Name), W/o MANCHURI RAGHUNATHA, R/o D.No.20-49-S17-2871, CSR Colony, Korlagunta, Tirupati, Tirupati Dist., AP. My name changed from MANCHURI SUMALATHA (Old Name) to SAGABALA SUMALATHA (New Name).
AJT -

CHANGE OF NAME

I, KUNDALA THULASAMMA (Old Name), W/o Chintamani Swaroop Kumar, Resident at D.No.17/390/2/B4, NVR Street, Madanapalle Town and Mandal, Annamaiah District, AP, 517325. Shall Henceforth be Known as CHINTHAMANI THULASI SWAROOP (New Name). Sd/ Chinthamani Thulasi Swaroop.
AJT -1306

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA- 246596

HEALTH CARE

డా॥కె. కీర్తన(M.D., Pediatrics, SVMS &Ex Senior Resident, RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్న పిల్లల వైద్యనిపుణులు. 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. శ్రీ విష్ణు చిన్న పిల్లల హాస్పిటల్, మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డికాలనీ, తిరుపతి. సెల్: 63035 53359
AJT -1599

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మింపబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడీవిటి

సేవా తత్పరతే నర్సింగ్ వృత్తికి ఆభరణం



పట్టాలు పొందిన నర్సింగ్ విద్యార్థులతో వైద్య ప్రముఖులు

కుప్పం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓర్పు, సహనం, సేవాతత్పరతలే నర్సింగ్ వృత్తికి ఆభరణాలుగా భాసిస్తాయని జిల్లా వైద్య ఆరోగ్యం శాఖ అధికారి డీటీ.సుధారాణి అన్నారు. కుప్పం పీఈఎస్ నర్సింగ్ కళాశాల 16వ స్నాతకోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో 2020-21 బ్యాచ్‌కు చెందిన 94 మంది బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు, 2022-23 బ్యాచ్‌కు చెందిన ఓ ఎమ్మెస్సీ నర్సింగ్ విద్యార్థి డిగ్రీలు అందుకున్నారు. బీఎస్సీ నర్సింగ్ 2020-21 బ్యాచ్ విద్యార్థి ఎ.స్వప్న ప్రియకు ఉత్తమ అవుట్ గోయింగ్ అవార్డు బహూకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎం అండ్ హెచ్‌వో సుధారాణి మాట్లాడుతూ అంటు వ్యాధుల మహమ్మారి కాలంలో, కరోనా సంక్షోభంలో ఇతర వ్యాధుల విపత్తులలో నర్సులు చేసిన నిస్వార్థ సేవలను కొనియాడారు. విద్యార్థులు తమ వృత్తి నైపుణ్యాన్ని కరుణ, నైతికతతో కలిసి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ నర్సింగ్ కేవలం వృత్తి మాత్రమే కాదన్నారు. సేవ, సహనం, విశిష్టతలపై నిలిచిన పవిత్రమైన వృత్తిగా నర్సింగ్ వృత్తిని పేర్కొన్నారు. పీఈఎస్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌కే.సుబ్రహ్మణ్య మాట్లాడుతూ నైతిక విలువలను రంగరించి నర్సులు శాంతి సహనాలతో సేవలు అందించాలని చెప్పారు. ఆధార పూర్వకమైన వైద్య పద్ధతులను స్వీకరించాలన్నారు. మారుతున్న ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొనేందుకు నర్సులే కాక వైద్యులు, వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని చెప్పారు. పీఈఎస్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అభిరామి స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి బోయకొండ దసరా ఉత్సవాలు


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 23 నుంచి అక్టోబరు 2 వరకు జరిగే దసరా మహోత్సవాల బుక్‌లెట్‌ను పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఆలయ ఈవో ఏకాంబరం, టీడీపీ మండలాధ్యక్షులు రమేష్ రెడ్డి, ఆలయ అర్చకులు గంగిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిపై దాడి


సోమల పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్న సీఐ రాంభూపాల్

సోమల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోమల బీజేపీ మండలాధ్యక్షుడు హేమగిరిపై ఓ వర్గం దాడి చేసి గాయపరిచినట్లు బుధవారం బాధితుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం రాత్రి పెద్దఉప్పరపల్లె బస్టాండులో హేమగిరి ఒంటరిగా ఉండగా ఓవర్గం పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని దాడి చేసి గాయపరిచారు. హేమగిరి పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. పెద్దఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీలోని పలు ఆలయ భూములు అన్యాక్రాంతం కావడంతో హేమగిరి వాటిని అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆలయ భూములను స్వాధీనం చేసుకోవాలని, అనంతరం వేలం నిర్వహించాలని దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆలయ భూములపై అధికారులకు ఫిర్యాదు చేశాడనే నెపంతో ఓ వర్గం దాడి చేసి గాయపరినట్లు హేమగిరి సోదరుడు చంద్రశేఖర్ సోమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి చేసి గాయపరచిన దుండగులను అరెస్టు చేసి ఆలయ భూములను ఆక్రమించుకున్న వ్యక్తుల నుంచి భూమిని స్వాధీనం చేసుకోవాలని పుంగనూరు బీజేపీ నియోజక వర్గం కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు, జనసేన మండలాధ్యక్షుడు భూషన్ రాయల్, ఏఎంసీ డైరెక్టర్ కైవారం మురళీ కార్యకర్తలతో చౌడేపల్లె సీఐ రాంభూపాల్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

● వేలంలో రూ.1.50 లక్షలు పలికిన లడ్డు


వినాయకుడి నిమజ్జనంలో పాల్గొన్న నిర్వాహకులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా స్థానిక నగరిలోని జమీందారీ ప్యాలెస్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని బుధవారం అత్యంత వైభవంగా ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. వినాయకుడిని ఏర్పాటు చేసిన నిర్వాహకులు 13 రోజులపాటు ప్రత్యేక పూజలు చేసి అన్నదానాలు చేశారు. వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ బహిరంగ వేలంలో శ్రీనివాసులు రూ. 1.50 లక్షలకు దక్కించుకున్నాడు. అనంతరం యువత ఉట్లుకొట్టి రంగులు చల్లుకుంటూ పట్టణ సమీపంలోని పుంగమ్మ చెరువుకు తరలించి నిమజ్జనం చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

IN THE COURT OF THE DISTRICT JUDGE,CHITTOOR
A.S.NO. 25 OF 2023
AND
I.A.NO. 58 OF 2023
IN
A.S.NO. 25 OF 2023
O.S.NO.3 OF 2014 Senior Civil Judge Court: Palamaner
Between:
S.Iqubal ...Appellant/Defendant & Petitioner/Appellant
And:
P.N.Sreeramulu & others ... Respondents/Plaintiffs
To
The Respondent No.5 & Respondent No.7
1.Smt Padmavathi W/o Late Nagesh Kumar, Hindu, aged about 61 years, cultivation, Patrapalli Village, V.Kota Town, Post and Mandal, Chittoor District
2. Smt Nirmala W/o Srinivasulu, Hindu, aged about 54 years, House-wife, D.No.13-110, Patrapalli Village, V.Kota Town, Post and Mandal, Chittoor District
Take notice that the above case and above petition for your notice and appearance are stand posted to **23-10-2025 at 10-30 a.m.** before the above Court. Therefore at you are at liberty to appear either in person or through Advocate before the above Court on **23-10-2025 at 10-30 A.M.** and to raise objections if any, failing which the matter will be decided according to law.
Sd/- **G.VASANTHA KUMAR**
Advocate for Appellant/ Defendant & Petitioner/ Appellant
Place: Chittoor Date: 06-09-2025

జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

పుంగనూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ పని చేస్తున్నట్లు సంఘ రాష్ట్ర నాయకుడు జయరాజ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పంచాయతీరాజ్ బంగ్లాలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టు హక్కుల కోసం పోరాటం చేసి హక్కులను సాధించుకోవాల్సి ఉందని తెలిపారు.

కుప్పం ఎంపీడీవోగా వెంకటేశ్వర్లు



కుప్పం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా ఎం.వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో పరిపాలనాధికారి (ఏవో)గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై కుప్పం వచ్చారు. ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో వెంకటేశ్వర్లను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను ఘనంగా సన్మానించారు.

కుప్పం పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


పీజీ.సెల్వం, కె.గణేశ్‌పిళ్లై

కుప్పం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కుప్పం నియోజకవర్గ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పీజీ.సెల్వం, కె.గణేశ్‌పిళ్లైలు ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా రఘునాథం, కార్యవర్గ సభ్యులుగా వి.ప్రభాకర్, కె.రామచంద్రన్, పి.ఇనాయతుల్లా, ఆర్.రాజశేఖర్, బి.సత్యనారాయణశెట్టి, మునెప్ప, శంకరయ్యలను ఎన్నుకున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో ఉషారాణి

పలమనేరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత అలవరచుకోవాలని, పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని పలమనేరు సీడీపీవో ఉషారాణి సూచించారు. బుధవారం పలమనేరు బాలికోన్నత పాఠశాలలో సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాల్యవివాహాలు, పౌష్టికాహారం, చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో జయశంకర్, మెప్మా సీఎంవో బాబా, హెచ్‌ఎం మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు మహేశ్వరి, అనసూయమ్మ, శాంతి, చిలకమ్మ, లత తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రరెడ్డికి అదనపు ఈవో సన్మానం


సన్మానిస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

పలమనేరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకు చెందిన కాప్పల్లి రవీంద్రరెడ్డిని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి బుధవారం శాలువతో ఘనంగా సన్మానించి స్వామివారి ప్రసాదాలను అందించారు. కాప్పల్లి రవీంద్రరెడ్డి తిరుమల వెంగమాంబ అన్నప్రసాదం తయారీ కోసం ఇక్కడి దాతల నుంచే కాకుండా కర్ణాటకలోని మార్కెట్ల నుంచి ఉచితంగా కూరగాయలను సేకరించి పంపుతున్నారు. ఈనెల 24 నుంచి ప్రారంభమయ్యే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు కూరగాయలను సరఫరా చేయనున్నట్లు రవీంద్రరెడ్డి తెలిపారు.

కుప్పం టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ వీజీ చిన్ని మృతి


వీజీ.చిన్ని (ఫైల్ ఫొటో)

కుప్పం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ వీజీ.చిన్ని (60) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. సుమారు నెలరోజులుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్ని కొన్ని రోజులుగా బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ఆయన 2013 నుంచి 2018 వరకు కుప్పం టౌన్ బ్యాంకు చైర్మన్‌గా దీర్ఘకాలంపాటు కొనసాగారు. కేవలం కుప్పం పట్టణంలోనే కాక నియోజకవర్గం మొత్తం సుపరిచితుడైన చిన్ని మృతికి పలువురు రాజకీయ, పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

వారంలోపు కులధ్రువీకరణ సర్టిఫికెట్ల పరిశీలన


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పార్వతి

చౌడేపల్లె, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వారంలోపు కుల ధ్రువీకరణపై సుమోటాగా తనిఖీ పూర్తి కావాలని తహసీల్దార్ పార్వతి వీఆర్‌వోలను ఆదేశించారు. బుధవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. గతంలో వాలంటీర్ల ఆధ్వర్యంలో మండలంలో 10,681 కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని.. వాటిలో సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించారా... లేదా అని సుమోటాగా తనిఖీ చేయాలన్నారు. ఇప్పటివరకు కేవలం 3 వేల ధ్రువీకరణ పత్రాలు మాత్రమే పరిశీలించారని, మిగిలిన 7,681 మంది ధ్రువీకరణ పత్రాలను వేగవంతంగా వారంలోపు తనిఖీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ రామ్మూర్తి, వీఆర్‌వో మల్లిఖార్జురెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

సోమల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్ అన్నారు. బుధవారం స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో సీఎం చంద్రబాబు వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని అభిమానులు, కార్యకర్తలకు స్వీట్లు పంచారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత లేదని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తోందని మండి పడ్డారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకుప్పంలో కృష్ణమ్మ గలగల

● మొరవ పారుతున్న అత్తికుప్పం వీరాశిచెరువు


కృష్ణా జలాలతో నిండిన వీరాశిచెరువు


మొరవ ప్రవాహం వద్ద సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

రామకుప్పం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువలో వస్తున్న కృష్ణా జలాలతో రామకుప్పం మండలం అత్తికుప్పం వీరాశిచెరువు నిండు కుండలా కళకళలాడుతోంది. గత నెల 22న కృష్ణా జలాలు వి.కోట మండలంలోకి, 24న అవి కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం బైపరెడ్డపల్లె సమీపంలోని కాలువ వద్దకు ప్రవేశించాయి. 25న జలప్రవాహం ఎక్కువగా ఉండటం, శాంతిపురం సరిహద్దులో కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించడానికి జలాలను అత్తికుప్పం వీరాశీచెరువుకు మళ్లించారు. దీంతో నియోజకవర్గంలోనే కృష్ణాజలాలు మొట్టమొదటగా వీరాశిచెరువుకు చేరాయి. అనంతరం అక్కడి గేటును మూసివేసినప్పటికీ గేటు నుంచి చెప్పుకోదగ్గ స్థాయిలో జలాలు చెరువలోకి వస్తూనే ఉన్నాయి. గత పది రోజులుగా కృష్ణాజలాలు వీరాశిచెరువుకు పరవళ్లు తొక్కింది. బుధవారం సాయంత్రానికి చెరువు నిండి, మొరవ ప్రవాహం ప్రారంభమైంది. మొరవ ప్రవాహంతో కృష్ణమ్మ మణీంద్రం చెరువు వైపు పరుగులు తీస్తోంది. మండలంలోనే మొట్టమొదటగా తమ చెరువు నిండటంతో టీడీపీ నేతలు ఐటీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానశేఖర్‌రెడ్డి, ఆత్మా మాజీ డైరెక్టరు రామలింగారెడ్డి, బూత్ కన్వీనర్లు మోహన్, సతీష్‌తోపాటు పలువురు రైతులు మొరవ వద్దకు చేరుకుని హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మండలంలోని మూడు పెద్దచెరువల్లో ఒకటైన మణీంద్రం చెరువు నిండితే సుమారు 10 గ్రామాల పరిధిలో భూగర్భజలాలు పెరుగుతాయి. మణీంద్రం చెరువు నిండితే జలాలు నేరుగా మరో పెద్దచెరువైన కెంచనబల్ల తోట్లచెరువుకు చేరుతుంది. మండలంలో చెరువులు నిండి కళకళలాడుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతకు అన్నివిధాలా అండ


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, సెప్టెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతకు అన్నివిధాలా అండగా నిలుస్తోందని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధి బందార్లపల్లె రైతు సేవా కేంద్రంలో ఆయన రైతులకు పశుగ్రాసం, మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. రైతుకు ఏ కష్టం కలిగినా రాష్ట్ర ప్రభుత్వం సత్వరం స్పందించి ఆదుకుంటుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. యూరియా కొరత ఏర్పడటంతో వెంటనే కేంద్రంతో మాట్లాడి రాష్ట్రానికి సత్వరం విరివిగా యూరియా బస్తాలు తీసుకురావడమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి పెరుమాళ్, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, కడ సలహా కమిటీ సభ్యుడు రఘు, యూనిట్ ఇన్‌చార్జి మునిరెడ్డి, నేతలు లక్ష్మీనారాయణరెడ్డి, మంజునాథ్, రవికుమార్, గిరి తదితరులు పాల్గొన్నారు

రైతులందరికీ యూరియా పంపిణీ

రామకుప్పం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరతతో రైతులు పడుతున్న బాధలను తెలుసుకున్న సీఎం చంద్రబాబు కేంద్రంతో సంప్రదించి రాష్ట్రానికి విరివిగా యూరియా తెప్పించారని తెలుగు రైతు కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతుకు యూరియా అందేలా చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలో యూరియా కొరతతో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగలేదన్నారు. రైతులకు సబ్సిడీ ధరలతో విరివిగా వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, విత్తనాలు అందిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా పాడి రైతులకు గోకులం షెడ్లు మంజూరు చేసిందన్నారు. అంతేకాకుండా సాగునీటి సంఘాల ద్వారా చెరువుల సప్లై, ఫీడర్ చానళ్ల పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయని ఆయన ఆ ప్రకటనలో తెలపారు.

మామిడి కత్తిరింపులు తప్పనిసరి

సోమల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో కాయల కోత అనంతరం కొమ్మల కత్తిరింపు తప్పని సరిగా చేపట్టాలని ఉద్యాన అధికారిణి సంతోషి కుమారి తెలిపారు. బుధవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో ఆమె మాట్లాడుతూ మామిడిలో తేనె మంచు పురుగు, మంగును కొమ్మల కత్తిరింపుతో నివారించుకోవాలన్నారు. కొమ్మలను కత్తించిన అనంతరం బ్లైటాక్స్, బౌర్ డియాక్స్ పేస్ట్ పూయాలన్నారు. 20 సంవత్సరాలు అంతకు మించిన తోటల్లో దిగుబడి పెంచుకోవడం కోసం అంట్లు కట్టుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీ అమలు చేస్తుందని తెలిపారు. అలాగే కొత్తగా నాటిన పండ్ల తోటలు, బొప్పాయి, కాకర, బీర పంటలు, శాశ్వత పందిళ్లు, ప్యాక్ హౌస్, వ్యక్తిగత సామూహిక ఫారంపాండ్లకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఉద్యానశాఖ అందిస్తున్నట్లు వివరించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం


ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులు సన్మానిస్తున్న ఇర్ఫాన్‌భాషా

రొంపిచెర్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకున్న ఇర్ఫాన్‌భాషాను బుధవారం రొంపిచెర్ల ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుజాత , అగ్సర్‌భాషా, మహమ్మద్ అలీ, ఎస్ఎంసీ చైర్మన్ ఖాదర్‌భాష తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీ డీఈగా వెంకటయ్య బాధ్యతలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు డివిజన్ ఆర్ అండ్‌బీ డీఈగా వెంకటయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆదోని నుంచి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో రోడ్లు గుంతలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వర్షాకాలం రోడ్డు గుంతలు పడటం సహజమని, వాటిని గుర్తించి వెంటనే మరమ్మతులు చేపడతామన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము


మృతుడి కుటుంబ సభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న పుంగనూరు జనసేన నాయకులు

పుంగనూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నరేశ్‌రాయల్ కుటుంబానికి జనసేన అండగా ఉంటుందని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బీమా పథకం ద్వారా రూ. 5 లక్షల చెక్కును అందించినట్లు పుంగనూరు సింగిల్‌విండో చైర్మన్ పగడాల రమణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పులిచెర్ల మండలం కావేటిగారిపల్లెకు చెందిన కె. నరేశ్‌రాయల్ జనసేన పార్టీలో క్రియాశీలకంగా పని చేశారని.. వారి కుటుంబానికి రూ.5 లక్షలు చెక్ అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చైతన్యరాయల్, నరేశ్‌రాయల్, నాగభూషణం, చాంద్‌బాషా, మురళీరాయల్, దీపమోహన్, నవీన్‌రాయల్, గిరి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన కుమార్

పెద్దపంజాణి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్దపంజాణి మండలంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు మండలంలోని బట్టందొడ్డి పంచాయతీ గడ్డూరు గ్రామానికి చెందిన కృష్ణప్ప కుమారుడు కుమార్(25) తన ఇంట్లో పైకప్పుకు సపోర్టుగా ఉన్న ఇనుప పైపునకు బుధవారం ఉదయం ఉరేసుకుని మృతిచెందాడు. కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని మృతుడి అన్న దొరస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ ధనంజయనాయుడు

కల్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని సింగిల్ విండో అధ్యక్షులు ధనంజయనాయుడు, కో ఆపరేటివ్ సొసైటీ సీఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. పులిచెర్ల సహకార సంఘం కార్యాలయంలో బుధవారం డీసీసీ బ్యాంకు, సహకార సంఘం అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హతున్న రైతులకు 7 శాతం వడ్డీతో రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలు అందజేస్తామన్నారు. త్వరలో సహకార సంఘం కార్యాలయంలోనూ బంగారంపై రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. డీసీసీ బ్యాంకులో డిపాజిట్‌లను పెంచడం, బ్యాంకులను ఆధునీకరించడం, రైతుల్లో నమ్మకం పెంచడం, అభివృద్ధి పథకాలు అమలుచేయడం, ఆర్థికసేవలు విస్తరించడం వంటివి ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. విండో డైరెక్టర్లు జయకుమార్, గురప్ప, టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, మహేష్, నారాయణస్వామినాయుడు, రమేష్, డీసీసీ బ్యాంకు సూపర్వైజర్ వెంకట్రమణ, ప్రజలు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనుల రికార్డుల నిర్వహణలో లోపాలు

● ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.2.66 లక్షల రికవరీకి ఆదేశాలు


ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రవికుమార్

రామకుప్పం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో గత మార్చి వరకు ఏడాది జరిగిన ఉపాధి పనుల్లో రూ.2.66 లక్షల అవినీతి జరిగిందని.. వెంటనే బాధ్యులు ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయించాలని డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ ఆదేశించారు. జిల్లాలో ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీ బృందం వివరాలను చదివి వినిపించారు. ఇందులో రూ.2,66,801 రికవరీ, జరిమానాలు వసూలు చేయాలని ఏపీవో గణేష్‌ను పీడీ ఆదేశించారు. ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలని, ఎలాంటి అవినీతి, ఆరోపణలకు తావివ్వరాదన్నారు. ప్రజోపయోగ పనులు చేపట్టాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఏపీవో రవికుమార్, గ్రంథాల పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, టీడీపీ, జనసేన మండల ప్రధాన కార్యదర్శులు నరసింహులు, భాస్కర్, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, కామరాజనాయక్, పెరుమాళ్, జేయి తదితరులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన పెంచండి

● ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య



పెనుమూరు సబ్‌స్టేషన్ వద్ద గురవయ్య తదితరులు

పెనుమూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య పిలుపునిచ్చారు. పెనుమూరులో బుధవారం సాయంత్రం సబ్‌స్టేషన్‌ను ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ తనిఖీచేసి, అనంతరం అక్కడ రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపై సోలార్ అమర్చుకునేవిధంగా వినియోగదారులను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ప్రోత్సాహించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ సురేష్‌కుమార్, డీఈలు చంద్రబాబు, శేషాద్రిరెడ్డి, ఏఈ తులసీ ప్రసాద్, లైన్‌మెన్‌లు ప్రభాకర్ రెడ్డి, పద్మనాభనాయుడు, రాజేంద్రరెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ వాదిని ఉప రాష్ట్రపతిగా గెలిపించారు

● కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి



చిత్తూరు సిటీ, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ ప్రధాన లక్ష్యమని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నేత కిల్లి కృపారాణి అన్నారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఒక న్యాయ కోవిదుడు ఉపరాష్ట్రపతి పదవికి పోటీపడితే, ఒక ఆర్ఎస్ఎస్ వాదికి టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు ఓటేసి చరిత్రహీనులుగా మిగిలిపోయారన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను మోదీ కాళ్ళదగ్గర తాకట్టు పెట్టారని ఆరోపించారు. ఏఐసీసీ సభ్యులు సుంకర పద్మశ్రీ, కిల్లి రామ్మోహన్, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

కిల్లి కృపారాణి వ్యాఖ్యలు వెనక్కితీసుకోవాలి: బీజేపీ



మాట్లాడుతున్న చిట్టిబాబు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గురించి మాజీ మంత్రి కిల్లి కృపారాణి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వీటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేపీ సీనియర్ నేత చిట్టిబాబు అన్నారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో చీకటి రోజు అని స్వయం సేవక్ సంఘ్ గురించి ఉద్దేశపూర్వకంగా మాట్లాడటం దారుణమన్నారు. సీపీ రాధాకృష్ణన్ జాతీయవాది, స్వయం సేవకులు, బాల్యం నుంచి దేశం కోసం, ధర్మం కోసం పోరాడిన వ్యక్తిగా అభివర్ణించారు. ఓడిపోతామని ఉప రాష్ట్రపతి పదవికి తెలిసి కూడా తెలుగు వారిని అభ్యర్థిగా కాంగ్రెస్ నిలబెట్టడం అవమానకరమన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రామభద్ర, బ్రహ్మానందం, కరుణాకర్‌సిద్ధు, పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

రోజాకు రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడంలేదా: టీడీపీ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం మాజీ మంత్రి రోజాకు కనిపించడంలేదా అని రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత బుధవారం వేరువేరు ప్రకటనల్లో ప్రశ్నించారు. అనంతపురంలో జరుగుతున్న 'సూపర్ సిక్స్ - సూపర్ హిట్' కార్యక్రమాన్ని నీరుగార్చేందుకు మాజీ మంత్రి రోజా ప్రభుత్వంపైన, సీఎం చంద్రబాబుపైనా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడిన 15 నెలలలోపే ఇచ్చిన హామీలలో 90 శాతం అమలు చేసినట్లు చెప్పారు. కేవలం 11 సీట్లకే పరిమితం చేసినా వైసీపీ నేతలకు ఇంకా బుద్ధిరాలేదని వారు విమర్శించారు.

రాజకీయ లబ్ధి కోసమే రైతులపై ప్రేమ

నిండ్ర, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసమే రైతులపై ప్రేమ ఉన్నట్లు వైసీపీ నాయకులు డ్రామా ఆడుతున్నారని రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆరోపించారు. బుధవారం నగరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం వైసీపీ నాయకులు ఎరువులు అందుబాటులో లేక పక్క రాష్ట్రమైన తమిళనాడులో తెచ్చుకుంటున్నారని అబద్ధపు ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నగరి సహకార సంఘంలో 13 టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. ఎరువు దొరకడం లేదన్న వైసీపీ నాయకులు, రైతులు వస్తే ఎరువులు అందిస్తామన్నారు. సమావేశంలో నగరి రూరల్ టీడీపీ మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, నగరి పీఏసీఎస్ చైర్మన్ బాలాజీ, మాజీ చైర్మన్ సురేష్‌నాయుడు, రైతులు దుర్వాసనరెడ్డి, భూపాల్‌రెడ్డి, సెల్వమణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరవ్వాలి

పూతలపట్టు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పాఠశాలకు సకాలంలో విధులకు హాజరవ్వాలని మండల స్పెషలాఫీసర్ విక్రమ్‌కుమార్ రెడ్డి కోరారు. బుధవారం ఆయన మండలంలోని పి.కొత్తకోట ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE VI ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) CUM J.F.C.M. FOR EXCISE,CHITTOOR
O.S.NO. 854 /2023
And
I.A.NO. 117 /2023
In
O.S.NO. 854 /2023

Between:-
1. K.Subramanyam Reddy
2. Y.Damodar Reddy
3. Y.Savithri @ Bujji
...Plaintiffs/ Petitioner/Plaintiffs

And: -
1. Somasekhar Reddy
2. Ramakrishna Reddy
3. K.Dharmalinga Reddy
4. K.Veeraswamy Reddy
5. K.Cheeranjeevi Reddy
6. Y.Roopa
7. Y.Venkatesulu Reddy
8. Y.Subramanyam Reddy
9. Y.Veeraswamy Reddy
..Defendants/Respondents/Defendants

THE 2ND DEFENDANT/2ND RESPONDENT
Ramakrishna Reddy S/o Late Peddabba Reddy, Hindu, aged about 52 years, cultivation, residing at Kondakindha vooru, H/o Vinjam,S.S. Konda Post, G.D.Nellore Mandal,Chittoor District.

Take notice that the above case and also the above petition with respect to hereunder mentioned schedule property for your notice and appearance are stand posted to **25-09-2025 at 10-30 a.m.** before the above Court. Therefore at you are at liberty to appear either in Person or through Advocate before the above Court on **25-09-2025 at 10-30 A.M.** and to raise objections if any, failing which the matter will be decided according to law.

SCHEDULE
Chittoor District - Chittoor Sub District (Rural)-G.D. Revenue Mandal - Vinjam Revenue Village-- S.S. Konda Village- Sy.No.338/2 - the vacant site an Ac.0.75 cents as Sy.No.338/2C situate within the following boundaries:
East : The site of the joint owners Y.Peddabba Reddy, Y.Sidda Reddy and Y. Chinnayalu Reddy, **West:** Cart track cum mud road running from south to north and further west is the compound wall of High School and Gram Sachivalayam and Ryot Barosa Building,**North:** Tank channel running from west to east and further north the land of Abbaiah Reddy, **South:** Bus road from Chittoor to Balaganganapalli

Sd/- **G.VASANTHA KUMAR**
Advocate for Petitioners/ Petitioners/Plaintiffs
Place: Chittoor Date: 06-09-2025

పోస్టర్ ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు జాతీయ పశు వైద్య నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు టీకాల కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చెప్పారు. పశు యజమానులు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత టీకాల కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పశువైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

రికార్డులు సకాలంలో అందించాలి

గుడిపాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏదైనా రిపోర్ట్ అడిగినప్పుడు సకాలంలో స్పందించక ఇబ్బందులు పెడ్తున్నారని పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు లేనివి, అసంపూర్తి భవనాల వివరాలు అడిగితే ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇకపై ఇలాంటి చర్యలు చోటుచేసుకుంటే క్రమశిక్షణా చర్యలు తప్పవన్నారు.

ఓబీసీలకు పెద్దపీట వేయడం బీజేపీకే సాధ్యం



మోదీ, నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఓబీసీలకు పెద్దపీట వేయడం బీజేపీకే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు అన్నారు. సామాన్య కార్యకర్తగా పనిచేసిన రాధాకృష్ణన్‌ను భారత ఉపరాష్ట్రపతిగా చేయడాన్ని స్వాగతిస్తూ బీజేపీ శ్రేణులు బుధవారం గాంధీ విగ్రహం ముందు ప్రధాని మోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బీజేపీ శ్రేణులు రవికుమార్, అరుణ, సత్యభామ, బాబు, సుధాకర్, రెహమాన్, దామోదరరెడ్డి, షణ్ముగం, లితిష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీకి నిదర్శనం చంద్రబాబు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీకి విలువలతో కూడిన రాజకీయాలకు నిదర్శనం ముఖ్యమంత్రి చంద్రబాబు అని పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కామసాని కోదండరెడ్డి, నియాజ్‌అలీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబు నిజాయితీకి అవినీతి మరక అంటించలేక, వైసీపీ పతనానికి వారే నాందిపలికారని, దాంతో గడిచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘోరపరాభవాన్ని చవిచూశారని తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో రవికుమార్ నాయుడు

గుడిపాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీఈవో రవికుమార్, డీపీవో సుధాకర్ తెలిపారు. బుధవారం మండల ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చి ప్రజలను చైతన్యపరచాలన్నారు. ప్రభుత్వ నిధులు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయరాదన్నారు. గ్రీన్ అంబాసిడర్‌కు నెలనెలా వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కుమార్, ఈవోఆర్డీ కృష్ణప్రసాద్, ఎఈ ప్రసాద్‌నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై జేసీఐ ఉచిత శిక్షణ



విద్యార్థులతో జేసీఐ ప్రతినిధులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు జీవన శైలిపై అవగాహన అవసరమని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ చిత్తూరు గోల్డ్ (జేసీఐ) అధ్యక్షుడు ఎంవీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ఓ కళాశాలలో జేసీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు జీవన శైలి, జీవన నైపుణ్యాలు, డిజిటల్ అక్షరాస్యత, కృత్రిమ ఇంటెలిజెన్స్, ఆర్థిక స్వేచ్ఛ, వినియోగదారుల హక్కులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జేసీఐ వీక్ పేరుతో విద్యార్థులకు నైపుణ్యాలపై ప్రతి రోజు ఒక కళాశాలను ఎంచుకొని వివిధ నైపుణ్యాలపై ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. జేసీఐ సభ్యులు జీకే మనోహర్, హరిక్రిష్ణరెడ్డి, శివకుమార్ రెడ్డి, గిరిబాబు రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి కాలినడక భక్తులకు ఉచిత వసతి, భోజన సదుపాయం

చిత్తూరు సిటీ, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనానికి వెళ్లే కాలినడక భక్తులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు చిత్తూరు శ్రీతరిగొండ వెంగమాంబ అన్నదాన ప్రసాద ట్రస్ట్ అధ్యక్షుడు ఈశ్వర్ చెప్పారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ పెరటాసి నెల సందర్భంగా చిత్తూరు మీదుగా తిరుమలకు కాలినడకన వెళ్లే తమిళనాడు, కర్ణాటక శ్రీవారి భక్తులకు ఉచిత వసతి, అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు చెప్పారు. స్థానిక కట్టమంచిలోని శాంతా రఘురామన్ కల్యాణ మండపం (ఎల్‌జీబీ కల్యాణ మండపం)లో ఈనెల 17 నుంచి అక్టోబర్ 16వ తేది వరకు 24 గంటలు భక్తులకు ఉచిత సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. విరాళాలు ఇవ్వదలచిన వారు, ఇతర వివరాలకు 9440823750, 9030204205 నెంబరును సంప్రదించాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు వేలు, మల్లి ఆచారి, హరిప్రసాద్ రెడ్డి, శంకర్, సుబ్రి, తిరుకుమరన్, సిద్దు, గజ, బాలాజి, జయకుమార్, యుగంధర్, మురుగ, కుమార్, తారక్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ రుణాలపై అవగాహన

యాదమరి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): యాదమరి సహకార సంఘం పరిధిలో ఉన్న రైతులకు రుణాలపై డీసీసీబీ ఓఎస్డీ లక్ష్మి అవగాహన కల్పించారు. బుధవారం జోడిచింతల పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గడువు దాటిన రుణాల గురించి రైతులను అడిగారు. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు మూడు శాతం వడ్డీ తిరిగి వస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సంఘం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రైతులు, పాలకవర్గం కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్‌పర్సన్ వి.చిత్ర నాయుడు, పాలకవర్గ సభ్యులు, సూపర్వైజర్ కవిత, సీఈవో గుణశేఖర్, డైరెక్టర్లు మహబూబ్ బాషా, ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

పెనుమూరు ఇన్‌చార్జ్ ఆర్ఐగా మనోజ్

పెనుమూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండల ఇన్‌చార్జ్ ఆర్ఐగా మనోజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఈయన్ను పెనుమూరు ఇన్‌చార్జ్ ఆర్ఐగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

భక్తి శ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని 75 దొడ్డిపల్లె షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోని సంపద వినాయక స్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ

విజయపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి పేరుతో మండలంలోని పన్నూరు ఉన్నత పాఠశాలలో పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సీడీపీవో ఇందిరప్రియదర్శిని బుధవారం ప్రారంభించారు. విద్యార్థినులకు యుక్తవయసులో వచ్చే మార్పులు, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. హెచ్ఎం జానకిరామ రెడ్డి, సూపర్‌వైజర్ లక్ష్మీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆస్థాన మండపంలో నృత్యం చేస్తున్న కళాకారులు - రుషులు, దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు

వరసిద్ధుడికి పట్టువస్త్రాల సమర్పణ



వరసిద్ధుడికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న దేవదాయ శాఖ విశ్రాంత ఏడీసీ కేశవులు - పాల కలశాలను కాణిపాకంలో ఊరేగిస్తున్న ఈవో పెంచలకిషోర్, ఉభయదారులు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ విశ్రాంత ఏడీసీ జి.కేశవులు కుటుంబ సభ్యులతో కలసి వరసిద్ధుడికి బుధవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రతి ఏటా చంద్రప్రభ వాహనం రోజున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అగరంపల్లెలోని తన స్వగృహం నుంచి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్‌కు అందజేశారు.

ఘనంగా కలశాల ఊరేగింపు

కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా బుధవారం కాణిపాకంలో ఉభయదారులు కలశాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. మణికంఠేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి పాల కలశాలను భక్తిశ్రద్ధలతో తీసుకొని కాణిపాకంలో ఊరేగించారు. అనంతరం ఆలయ కల్యాణ వేదిక వద్ద సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడికి విశేషంగా అభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

వైభవంగా గంగ జాతర



నగరి గంగమ్మకు టీటీడీ సారె అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్



గంగమ్మను దర్శించుకుంటున్న రోజా, ఆలయం వద్ద భక్తుల సందడి

నిండ్ర, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంతో పాటు పరిసరాల్లో ఉన్న 15 గ్రామాలైన ఏకాంబరకుప్పం, కేవీపీఆర్ పేట, సత్రవాడ, వినాయకపురం, చింతలపట్టెడ, సాల్వపటెడ, నగరిపేట, రామ్‌నగర్ రూరల్ మండలంలోని చిన్న తాంగేళ్, గుండ్రాజుకుప్పం, ఆది ఆంధ్రవాడ, రామాపురం, ఎస్‌వీపురం గ్రామాల్లో గంగ జాతర వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. పట్టణంలో డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ మంగళవారం రాత్రి గంగమ్మ పురవీధుల్లో వేసిన వేపాకు గుడిసెకు వచ్చి చేరింది. అమ్మవారి వేపాకు గుడిసె వద్ద టీటీడీ వారు చేపట్టిన పుష్పాలంకరణ నడుమ గంగమ్మ దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయం నుంచి మహిళలు అమ్మవారికి వేపాకు, సారెలు, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వెయ్యి కన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. జాతర నిర్వహించే ప్రాంతాల్లో డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్, సీఐ విక్రమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించారు. సాయంత్రానికి చావడి ప్రాంతం జన సమూహంతో కిక్కిరిసిపోయింది. మొక్కుబడితో విచిత్ర వేషధారణలో వచ్చిన భక్తులు సందడి చేశారు. బలి అన్నం సమర్పించే సమయంలో రద్దీ ఎక్కువైంది. రాత్రి గంగమ్మను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి పొలి మేర దాటించారు.



గంగమ్మను దర్శించుకున్న సినీ నటి మీనాక్షి దీక్షిత్

● గంగమ్మను దర్శించుకున్న ప్రముఖులు

గంగమ్మకు టీటీడీ సారెను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అందించి వన దుర్గాదేవి అలంకరణలో ఉన్న ఓరుగుంటాలమ్మను, మహిషాసుర మర్ధిని అలంకరణలో ఉన్న దేశమ్మను దర్శించుకున్నారు. అనంతరం మాజీ మంత్రి రోజా, గాలి జగదీష్, సినీ నటి మీనాక్షి దీక్షిత్ తదితరులు దర్శించుకున్నారు.

పెంపుడు కుక్కల ప్రదర్శన



ఉత్తమ ప్రతిభ కనబరిచిన పెంపుడు కుక్క యజమానికి బహుమతులు అందిస్తున్న జేడీ డాక్టర్ ఆరీఫ్

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): పెంపుడుకుక్కల ప్రదర్శన, వైద్యశిబిరానికి విశేష స్పందన లభించినట్లు బంగారుపాళ్యం ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆసీఫ్ తెలిపారు. బుధవారం స్థానిక పశువైద్యశాలలో జరిగిన పెంపుడుకుక్కల ఉచిత వైద్య శిబిరానికి మండలంలోని పలు గ్రామాల నుంచి 80 ఉత్తమ జాతి పెంపుడు కుక్కలు వచ్చాయి. వీటికి చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందించారు. నట్టల నివారణ, రేబిస్ వ్యాధి టీకాలు ఉచితంగా వేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆరీఫ్ పాల్గొని ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పెంపుడుకుక్కల యాజమానులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్, పశువైద్య శస్త్ర చికిత్స సహాయకులు డాక్టర్ యూన్సీ, డాక్టర్లు దినేష్, పవన్, దత్తకుమారి, అనిత, పశువైద్య సిబ్బంది, పెంపుడు కుక్కల యజమానులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న సర్పంచు ఉమాదేవి

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): బంగారపాళ్యం మేజర్ పంచాయతీలో గత ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను సర్పంచు ఉమాదేవీ, వైస్ సర్పంచ్ కామరాజు, మాజీ సర్పంచు కృష్ణమూర్తి బుధవారం దుశ్శాలువాలు, పూలమాలతో సత్కరించి, వారి సేవలను కొనియాడారు. పంచాయతీ కార్యదర్శి యుగంధర్, విశ్వనాథ్, ప్రసాద్, బాబు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ, టీడీపీ నేత నిధులతో పూడికతీత పనులు



పోటుకనుమ గ్రామస్తులు

పూతలపట్టు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం పోటుకనుమ చెరువుకు నీరు వచ్చే కాలువ పూడికతీత కార్యక్రమాన్ని బుధవారం స్థానిక టీడీపీ నేతలు ప్రారంభించారు. ఈ పనులను పోటుకనుమ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఆంధ్ర మధుబాబు తన సొంత ఖర్చులతో చేయిస్తున్నారు. పేటమిట్ట సర్పంచ్ రాధాకృష్ణ, చెరువుకమిటీ చైర్మన్ యువరాజులు నాయుడు, ఆంధ్ర చంద్రబాబు నాయుడు, నటరాజు నాయుడు, సుబ్బరాజులు, వీఆర్వో నాగేంద్ర, లక్ష్మీపతి నాయుడు, ఆంజనేయులు, రాజేంద్ర, చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ విజయవంతంపై సంబరాలు



కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నేత ఎల్బీఐ లోకేష్ రెడ్డి

పూతలపట్టు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల విజయవంతంపై మురకంబట్టు సర్కిల్ వద్ద బుధవారం రాత్రి టీడీపీ నేతలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. భారీఎత్తున బాణసంచా పేల్చి, కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎల్బీఐ అధినేత, టీడీపీ యువనేత ముత్తిరేవుల లోకేష్‌రెడ్డి, కార్పొరేటర్ నవీన్‌కుమార్, మాపాక్షి వెంకటేష్, నాగరాజు, ఉదయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మూలకండ్రిగ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఆర్‌బాబును కేఎంపురం, డీఎంపురం ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చలపతిరావు, భీమారావు ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయ వృత్తి వరం



మాట్లాడుతున్న భీమనేని చిట్టిబాబు

పాలసముద్రం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి వరమని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు అన్నారు. బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో ఎంపికైన ఉత్తమ ఆనందయ్య, ఎస్తర్ రాణి, దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులు, శోభ, మురుగదాస్, ప్రకాశం, చిరంజీవి, సురేష్ బాబు, పావనిలను సన్మానించారు. ఎంఈవోలు రాజేంద్రప్రసాద్, గిరిజ, విశ్రాంత హెచ్ఎం లింగమూర్తి, శాంతకుమారి, స్వామిరాజు, ఎస్టీయూ నాయకులు ప్రకాష్, కోదండయ్య, కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టు పురుగుల పెంపకంతో అధిక దిగుబడి

వెదురుకుప్పం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టు పురుగుల పెంపకంతో రైతులకు అధిక దిగుబడి వస్తుందని జిల్లా సెరికల్చర్ జాయింట్ డైరెక్టర్ పద్మమ్మ తెలిపారు. పెరుమాళ్లపల్లి రైతు సేవా కేంద్రంలో పట్టు రైతులకు నా పట్టు - నా అభిమానం కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత డాక్టర్ భరత్ మాట్లాడుతూ రైతులకు పట్టు పురుగుల రెరింగ్ గదిలో వచ్చే వ్యాధులు, డిసిన్ఫెక్షన్, గాలిలో తేమ శాతం, ఉష్ణోగ్రత గురించి అవగాహన కల్పించారు. మల్బరీ తోటల పెంపకలో వాడే ఎరువుల యాజమాన్యం, భూసార పరీక్ష గురించి గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి వెంకటలక్ష్మి గణేష్, సిబ్బంది, సర్పంచ్ శశి ఆనంద్‌రెడ్డి, ఎంపీటీసీ విజయ్‌శేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భగవత్ సంకల్పం సృష్టికి మూలం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి మోక్షం పొందాలంటే భగవత్ సంకల్పం అవసరమని ప్రముఖ ప్రవచన కర్త మోహనకుమారి తెలిపారు. కాణిపాక వరసిద్ధి వినాయక బ్రహోత్సవాల్లో బుధవారం భగవద్గీత - సంప్రదాయాలు అనే అంశంపై ఆమె ప్రవచనాలు చేశారు. ఆమెను ఆలయ డిప్యూటీ ఈవో రవినాయుడు సత్కరించి, స్వామి వారి దర్శన భాగ్యం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు

ఉపాధ్యాయులకు సన్మానం



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కరించబడ్డ ముస్లిం ఉపాధ్యాయులను నగర మైనార్టీ జేఏసీ నాయకులు బుధవారం స్థానిక చిన్న మసీదులో ఘనంగా సత్కరించారు. ప్రొఫెసర్ మహమ్మద్ అన్వర్ హుస్సేన్, ఉర్దూ ఉపాధ్యాయులు సాబ్జులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాఫర్‌షరీఫ్, కాలేషా, సయ్యద్ నయీముల్లాల జునైది, సయ్యద్, అంజువన్ అబ్దుల్, గని, అక్మల్‌ఖాన్, అల్తాఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఉత్సవం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్నియార్ బ్లాక్‌లో స్థానిక యువత ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమ వద్ద నిర్వహించిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు తన కుమారుడు సాయిక్రిష్ణారెడ్డితో పాల్గొని పూజలు చేశారు. సీకే బాబును ఉత్సవ నిర్వాహకులు పయని సత్కరించారు.

ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు

ఐరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండల ఎంపీడీవోగా భువనేశ్వరి అదనపు బాధ్యతలను బుధవారం స్వీకరించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆమె అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ధనలక్ష్మి పదోన్నతిపై డివిజినల్ లెవెల్ డెవలప్‌మెంట్ అధికారిగా బదిలీపై వెళ్లారు. భువనేశ్వరి మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు.

సంకల్పంతోనే లక్ష్యాలు సాధ్యం

నిండ్ర, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏ రంగంలో రాణించాలన్నా దృఢ సంకల్పం అవసరమని ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరా ప్రియదర్శిని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అమలుచేస్తున్న సంకల్పం పేరిట చేపట్టిన కార్యక్రమంలో భాగంగా బుధవారం నిండ్ర ఉన్నత పాఠశాలలో కిషోర బాలికలకు సమాజంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. హెచ్ఎం, శ్యామల, రేవతి, లక్ష్మి పాల్గొన్నారు.